12.3.95

# ఏకాకి నౌక చప్పుడు

అప్పుడప్పుడే తెల్లవారుతోంది.

రైలు పెట్టె కిటికీలోంచి బయటికి చూస్తూ ఉన్నాడు మోహన్. అతి వేగంగా వెళ్తున్న రైలుతోపాటు దూరంగా ఉన్న కొండలు కదులుతున్నట్టు అనిపిస్తోంది. కాసేపు కొండల్ని, కాసేపు చేలనీ, కాసేపు వెలవెలపోతున్న చందమామనీ, మరి కాసేపు రైలుకు వ్యతిరేక దిశలో పరుగెడుతున్న టెలిఫోన్ స్తంభాల్నీ మార్చి మార్చి చూస్తున్నా డతను. మరెప్పుడయినా అయితే తెల్లవారి వెలుతుర్నీ ప్రకృతి శోభనీ తృప్తిగా ఆస్వాదించేవాడే. ప్రస్తుతం అతనా స్థితిలో లేడు. అతని మనసు అనంతపురం పెద్దాసుపత్రిలో తిరుగుతోంది.

'టెలిగ్రామ్ వస్తూనే తను బయల్దేరి ఉండాల్సింది' అని పది నిమిషాల్లో అయిదుసార్లయినా అనుకుంటూ ఉన్నాడు.

తను ఎప్పుడూ తన వాళ్ల విషయంలో నిర్లక్ష్యం చేసి ఎరగడు. అందులోనూ నాన్న విషయమై ఎప్పుడెప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. తనకు ఏం మాయ గప్పిందో, ఏం దెయ్యం పూనిందో – లేకపోతే అనంతపురం నుంచి 'నాన్నని హాస్పిటల్‌లో అడ్మిట్ చేశా' రని టెలిగ్రాం వస్తే ఖాతరు చేయలేదు. ఏదో స్వల్పమైన అజీర్తి వల్ల ఏ విరేచనాలో పట్టుకుని ఉంటాయిలే ... లేదంటే బ్లడ్ ప్రెషర్ మనిషి కదా! రక్తపోటు కాస్త ఎక్కువయి ఉంటే హాస్పిటల్‌లో చేర్చి ఉంటారులే అని అనుకున్నాడు. అయినా విరేచనాలు ఎక్కువయితేనూ, రక్తపోటు విపరీతమైపోతేనూ ప్రాణాంతకమే నని తనకు తెలుసు. మరి ఎందుకింత నిర్లక్ష్యం చేశాడో ఇప్పుడు కారణం వెతికితే తెలియడంలేదు. తన నిర్లక్ష్యానికి సీత కూడా కొంత కారణమేమో! "ఇప్పుడేముంది లెండీ! గుండె జబ్బుల్లాంటి వాటికే మంచి మంచి మందులొచ్చాయి ... ఇక విరేచనాలూ, రక్తపోటు నయితే అతి తేలిగ్గా నయం చేసేస్తారు. మనకు కేవలం విషయం తెలవడం కోసం టెలిగ్రాం ఇచ్చారులా ఉంది" అనేసింది సీత.

తన కంటే సుధాకర్ అన్నయ్యే నయం – ఢిల్లీలో ఉన్నా ముందు ఆలోచనతో వెంటనే అనంతపురం చేరుకున్నాడు. సుధాకరే మొన్న ఫోన్ చేసి ... "ఏరా! టెలిగ్రాం అందలేదా? ఇక్కడ నాన్నకి చాలా సీరియస్‌గా ఉంది. కొద్దిసేపు మాట్లాడతాడు, వెంటనే కోమాలోకి వెళ్ళిపోతాడు. అయితే డాక్టరు రిపోర్టు చూస్తే అంతా నార్మల్‌గానే ఉన్నట్టు రాసి ఉంది. ఏం చేయాలో తోచడంలేదు. నువ్వు వెంటనే బయల్దేరు" అన్నాడు.

"ఇంతకీ ఏమయింది నాన్నకి?" అంటూ ఆత్రంగా అడిగాడు తను.

"అదంతా ఇక్కడికి కొచ్చాక చెబుతాను. ముందు నువ్వూ, సీతా, పిల్లలూ వెంటనే బయల్దేరి రండి. కనీసం నువ్వు వచ్చేవరకైనా నాన్న ఉండాలని ఇక్కడ అందరూ ఆశిస్తున్నారు. ఇక ఉంటాను" అంటూ పాఠం కంఠస్థం చేసి అప్పచెప్పిన పిల్లాడిలా మాట్లాడేసి ఫోన్ పెట్టేసినట్టు అనిపించింది తనకి.

ఫోన్ వచ్చిన తర్వాత గాని తను బయల్దేరలేకపోయినందుకు అనుక్షణం సిగ్గుపడుతున్నాడు మోహన్.

భారమంతా తన మీదనే వేసి నిద్రపోతూ ఉన్న శ్రీమతి వైపు ఓరగా ఓసారి చూశాడు మోహన్. కొంత బాధనిపించిందతనికి. "ఈ మనిషికి కొంతయినా నాన్న అనారోగ్యం గురించి ఆందోళన లేదా? హాయిగా ఒళ్ళు మరిచి నిద్రపోవడ మేమిటి?'

కాళ్ళ దగ్గర పడుకుని నిద్రపోతున్న ప్రణవ్, వంశీలను చూశాడు. 'ఈ పసికందులకీ, ఈవిడకీ ఏమీ వ్యత్యాసం లేదు. అదే ఈవిడ నాన్నకి సీరియస్‌గా ఉందని తెలిస్తే ఇట్లా నిశ్చింతగా నిద్రపోయేదా?'

'తనను చిన్నప్పటి నుంచి ఎంత గారాబంగానో పెంచి పెద్ద చేసి తన భవిష్యత్తు కోసం ఎంతో పాటుబడ్డ నాన్న ఆరోగ్య విషయంలో తను ఆందోళన చెందడంలో ఆశ్చర్యం ఏముందీ ! సీతకి అంత అనుబంధం ఎక్కడి నుంచి వస్తుంది? కేవలం తనను పెళ్ళి చేసికొన్నందుకు 'మామయ్య' అవుతాడంతే! లేకుంటే ఎవరికి ఎవరో' – ఇలా సాగుతున్నాయి అతని ఆలోచనలు.

రైలు పెట్టె మెల్ల మెల్లగా మేలుకొంటోంది. తన కుటుంబం తప్ప తక్కిన వాళ్లంతా ఉత్తరాదివాళ్లే అవడం వల్ల హిందీ, ఒరియా, బెంగాలీ భాషలు కలగాపులగంగా రైలు శబ్దంలో కలిసిపోయి వింతగా వినిపిస్తూ ఉన్నాయి.

"ఏమండీ! మీరు నిద్రపోలేదా?" అంది సీత ఆవలిస్తున్న గొంతుతో.

"ఊఁ" అన్నాడు, మోహన్.

"అనుకోని ప్రయాణ మయినందువల్ల ఇలా కూచోడానిక్కూడా సీట్లు లేక ఇబ్బంది పడుతున్నాం. లేకుంటేనా ముందు బెర్తులు రిజర్వు చేసుకుని హాయిగా అందరం నిద్రపోయేవాళ్ళం. నేను కొంచెం ఇలా సర్దుకుంటాను. అలా వెనక్కి జారగిలబడి చిన్న కునుకు తీయండి!" అంది సీత, కాస్త ముందుకు జరిగి.

"ఊహూ, నాకు నిద్ర రాలేదు."

"అంతే! మీరు ఉత్త ఆందోళన మనుషులు! మనిషి ఇక్కడ ఉన్నారు గానీ, మీ మనసంతా మామయ్య చుట్టే ఉంది. ఎందుకూ అలా ఊరికే ఆలోచిస్తూ ఆందోళన పడిపోతారు! అయ్యేదేదో అవుతుంది. అయినా ఏమయితే ఏం చేయగలం? వంశీగాడు చూడండి – ఎట్లా పడుకున్నాడో! ఏం రాచ ఠీవో గాడిదది, ప్రణవ్ గాడి మీద కాళ్లెట్లా వేశాడో చూడు" అంటూ మాట్లాడుతోంది సీత.

అన్నీ వింటున్నాడే గానీ ఏం సమాధానం ఇవ్వాలనిపించటంలేదు మోహన్‌కు. పాకెట్టులోంచి చివరి సిగరెట్టు తీసి వెలిగించాడు.

ఏదో స్టేషన్ వచ్చింది.

సిగరెట్లు తెచ్చుకునేందుకు రైలు దిగి వెళ్లాడు మోహన్. అతను తిరిగి వచ్చేటప్పటికి తల్లితో కబుర్లు చెప్పుకుంటూ ఉన్నారు ప్రణవ్, వంశీలు. ఇందాక నిద్రపోతున్న పిల్లలేనా వీళ్లు! అనిపించింది అతనికి.

నెమ్మదిగా సీటులో ఉన్న బెత్తెడు స్థలంలో సర్దుకొని కూర్చున్నాడు.

"ఏం సార్ టీ కావాలా?" అంటూ ఎవరో అడిగితే తలెత్తి చూశాడు మోహన్. నల్ల టబ్బాయి కాకీ యూనిఫాంలో, ట్రేలో ప్లాస్టిక్ టీ కప్పులతో నిలుచుని ఉన్నాడు.

"నాన్నా! తెలుగు మాట్లాడుతున్నాడు" అన్నాడు ప్రణవ్.

"మనం ఆంధ్ర బార్డర్‌లోకి వచ్చాంలేరా!" అంది సీత.

మోహన్ వాళ్లు ఉంటున్న గౌహతి చుట్టుపక్కల ఎవరూ తెలుగు మాట్లాడరు. ఎప్పుడో తెలుగువాళ్ళు మీటింగుల్లో తప్ప కలవరు. అందుకే పిల్లలకి తెలుగు ఎవరయినా మాట్లాడితే గొప్ప ఆశ్చర్యం!

"నాలుగు 'టీ' లు ఇవ్వు!" అంటూ ఆర్డరు చేశాడు మోహన్.

నాలుగు ప్లాస్టిక్ టీ గ్లాసులు అందించేసి డబ్బు తీసుకుని వెళ్లిపోయాడు టీ కుర్రాడు.

టీ తాగేసి ప్లాస్టిక్ కప్పుల్ని తల్లితో శుభ్రం చేయించుకుని ఆడుకుంటున్నారు పిల్లలు.

ఎంతకీ రైలు కదలలేదు.

తీరా మోహన్ ఎంక్వయిరీ చేస్తే తెలిసింది. ఆవేళ ఆ ఊళ్ళో 'బంద్' జరుగుతోందని, సాయంత్రానికి గానీ రైలు కదలదనీ.

'బంద్' వాళ్లని తిట్టుకుంటూ సిగరెట్టు వెలిగించుకున్నాడు మోహన్. 'తను అక్కడికి చేరే లోపల నాన్న ఈ లోకం విడిచి ...' ఈ ఆలోచన భరించలేకపోతున్నాడు.

* * *

"వాడికి ఫోన్ చేసి నాలుగు రోజులవుతోంది. ఏడీ, ఇప్పటికయినా చేరుకున్నాడా? ఎంత నిర్లక్ష్యమో! ఛీ ఛీ!" అసహనంగా అన్నాడు సుధాకర్.

తన అసహనంతో అది హాస్పిటల్ అని కూడా మరిచిపోయాడతను.

"వస్తాడులేరా! ఎందుకంత ఆత్ర పడతావు? వాడు ఎన్ని తిప్పలు పడుతున్నాడో ఎలా తెలుస్తుంది?"

"ఏమి టమ్మా అట్లా అంటావు? అంటే, నాకేనా తిప్పలు లేనిది? అసలిక్కడ ఎవరికి లేవు తిప్పలు? నిమ్మికి లేవా? అది మొగుడితోపాటు త్రివేంద్రం నుంచి రాలేదా? నాకు లేవా? నేను ఢిల్లీ నుంచి రాలేదా! రుక్కూకి లేవా? అది ఒరిస్సాలోని బొద్దు నుంచి రాలేదా! అది బాధ్యతమ్మా! తండ్రి మీద ప్రేమ ఉండాలి గానీ... మా కెవరికైనా ఫోన్ చేశారా? లేదే! 'ఫాదర్ అడ్మిటెడ్ హాస్పిటల్' అన్న టెలిగ్రాం ముక్కల్ని చదువుకుని రెక్కలు కట్టుకుని వాలాము".

బెడ్ మీద ఉన్న తండ్రినే చూస్తున్న నిర్మల, అన్నయ్య మాటలు విని: వరండాలోకి వచ్చేసింది.

"మోహనన్నయ్య ఈ పాటికి రావాల్సింది. డబ్బు కేమైనా ఇబ్బంది పడ్డాడేమో!"

"బాగున్నాయమ్మా నిమ్మీ, నీ మాటలు. వాడు బ్యాంకు ఆఫీసరు. వాడికి డబ్బు ఇబ్బందేమిటి?"

"వాడు చెప్పేదీ నిజమే ననుకో! మరి ఎందుకు రాలేదో? మామూలుగా అయితే ఇంతగా ఎదురుచూసేవాళ్ళమా? వాడు రాకనే జరగరానిది జరిగితే ..." అంటూ ఉంటే శారదమ్మ గొంతు బొంగురుపోయింది.

"చిన్న కొడుకని మోహనన్నయ్య మీదనే నాన్న ప్రాణమంతా!" అంటూనే ఏదో ఊహించుకుని తల్లితోపాటు కళ్లలో నీళ్లు పెట్టుకుంది నిర్మల.

"అన్నయ్యా! మీకందరికీ ఇక్కడికే టిఫెన్లు తెచ్చాను!" అంది రుక్మిణి, టిఫెన్లు ఉన్న ప్లాస్టిక్ వైరు బుట్టని గోడ కానిస్తూ.

"ఎందుకు తెచ్చావు రుక్కూ! ఇంటి కెళ్లి వచ్చేవాళ్లం కదమ్మా!" అన్నాడు సుధాకర్

"ఇప్పుడేమయింది - టిఫెన్ చేసి వెళ్తే సరి!" అంది రుక్మిణి.

"ఈ ఆస్పత్రి వాసనకి కడుపులో దేవుతుంటే ఏం తినబుద్ధవుతుంది. ఛీ ఛీ! డోకు వస్తుంది!" అంది నిర్మల వెంటనే డోకు వస్తున్నట్టు మొహం పెట్టి.

"ఏమో, తెచ్చాను. మీ ఇష్టం, ఇళ్లకే తీసుకెళ్లి తినండి. నాన్నకి కొబ్బరిబోండం నీళ్లు ఇచ్చారా?"

"ఇప్పుడే, అన్నయ్య సిరంజితో అరగంటసేపు గొట్టంలోకి ఎక్కించాడు" అంది నిర్మల.

"అదిగో, మోహన్ వస్తున్నాడు!" అంది శారదమ్మ, కాస్త ఉత్సాహం మిళితమైన కంఠంతో.

సుధాకర్ వరండా చివరికంటా చూశాడు. ఆస్పత్రి బయట ఆటోవాడికి డబ్బు లిస్తూ కనిపించాడు మోహన్. వంశీ, ప్రణవ్‌లు పరుగెత్తుకుంటూ వస్తున్నారు. వాళ్ల బూట్ల శబ్దాలకి అందరూ ఆ పిల్లల్నే చూస్తున్నారు. వాళ్లకి వెనకాల చిన్న బుట్టతో సీత

వస్తోంది. ఆమె వెనకాల మోహన్. ఆత్రం, ఆందోళనా మొహంలో గూడుకట్టుకోగా రెండు పెద్ద సూట్ కేసుల్నీ భారంగా మోస్తూ వస్తున్నాడు.

"నానమ్మా! బావున్నావా? వీడూ ... వీడేమో అమ్మని ఒకటే సతాయించాడు ట్రెయిన్‌లో" అంటూ ఒక కంప్లెయింట్ చేస్తూనే శారదమ్మని వాటేసుకున్నాడు ప్రణవ్.

"లేదు నానమ్మా! అన్నయ్యేమో ... " అంటూ సుధాకర్ వైపు చూసి సిగ్గుపడుతూ శారదమ్మ కుచ్చిళ్ళలో మొహం దాచేసుకున్నాడు వంశీ. పిల్ల లిద్దర్నీ ఆప్యాయంగా అదుముకుంది శారదమ్మ.

"ఎట్లా ఉంది అత్తయ్యా, మామయ్యకు?" అడిగింది సీత.

"అట్లానే ఉందమ్మా! మీ కోసం ఎదురు చూస్తున్నాం."

అందాకా ఏదేదో ఊహించుకుని ఆందోళన పడ్డ మోహన్‌కి తల్లినీ, అన్నయ్యనీ, చెల్లెళ్ళనీ చూసేటప్పటికి సగం ఆందోళన తగ్గింది.

దగ్గర కొస్తున్నట్టే -

"ఏడీ నాన్న?" అన్నాడు ఆత్రంగా.

"అదో అక్కడ!" అన్నాడు సుధాకర్.

రెండు సూట్ కేసుల్నీ పారేసినంత పనిచేసి ఆత్రంగా తండ్రి ఉన్న మంచం దగ్గరకి చేరుకున్నాడు మోహన్. ఒక్కసారిగా అతని కళ్లలో నీళ్లు తిరిగాయి.

"నాన్నా! నాన్నా! నేను వచ్చాను, నాన్నా!" అంటూ తండ్రి చెవిదగ్గరికి ఒంగి పిలిచాడు.

"అన్నయ్యా! నాన్న కోమాలో ఉన్నాడు. ఎప్పుడయినా కళ్లు తెరిచి చూస్తాడంతే! మనల్ని గుర్తించినట్టు తదేకంగా చూసి, మరి కాసేపటికి కోమాలోకి వెళ్లిపోతాడు" అంది నిర్మల.

"అన్నయ్యా! నీ మీద ఎంత ప్రాణమో, ఏమోగాని నీ పేరు ఆయనకి వినపడితే చాలు, కళ్లు తెరిచి అలా ఇలా చూస్తాడు!" అంది రుక్మిణి.

తండ్రి తల నిమిరాడు మోహన్. రెండు మూడు క్షణాలు మౌనంగా అలా తండ్రినే చూశాడు. ముక్కులోంచి ఓ ట్యూబు ఉంచారు. తన తండ్రి ఏ స్థితిలో ఉన్నదీ ఆ ట్యూబే చెబుతోంది.

"ఏమయింది నాన్నకి?" అన్నాడు మోహన్.

"పది రోజుల కిందట నాన్నకి జ్వరం వచ్చిందట అమ్మేమో జ్వరమే కదా ఏం చేస్తుందిలే అనుకుంది. ఆ మరుసటిరోజే గుండెల్లో మంట అన్నారట. అంతే, ఇక్కడ చేర్పించేసి మనకు టెలిగ్రాములు ఇచ్చింది" అని చెప్పింది నిర్మల.

"డాక్టర్లు ఏమన్నారు?"

"ఏ డాక్టరుకి నాన్న జబ్బు అంతుపట్టనట్టుగా ఉందిరా! ఎవర్నడిగినా ఏమీ చెప్పలేదు" అన్నాడు సుధాకర్.

"నానమ్మా! తాతయ్య ముక్కులో పైపు ఎందుకు పెట్టారు?" అడిగాడు వంశీ.

"నానమ్మా! తాతయ్య ముక్కు నొప్పి పుడుతుంది, తీసెయ్ నానమ్మా!" అన్నాడు ప్రణవ్.

తాతయ్య ముక్కులో ఎందుకు పైపు పెట్టిందీ, చెబుతోంది రుక్మిణి. చేష్టలు డిగినట్టు నిలుచుండిపోయాడు మోహన్. ఎందుకు తొందరగా బయలుదేరలేదని గుచ్చిగుచ్చి అడిగేస్తున్నాడు సుధాకర్. అన్నిటికీ యాంత్రికంగా జవాబులు ఇస్తున్నాడు మోహన్.

* * *

అప్పటికి వారం రోజులు గడిచిపోయాయి.

శారదమ్మకు ఇంట్లో ఉన్నంతసేపూ చాలా నెమ్మదిగా, హాయిగా ఉంటోంది. అసలా ఇంటిని ఎవరైనా చూస్తే – ఈవేళో, రేపో ఆ ఇంట్లో పెళ్ళి జరగబోతోందేమో నని అనుకుంటారు. మామూలుగా ఏ ఉగాదికో, దసరాకో కలిసే కూతుళ్ళూ, అల్లుళ్ళూ, కొడుకులూ, కోడళ్ళూ, వీళ్లందరి పిల్లలూ – వాళ్ల కోలాహలం చూస్తే చాలు ఎంతో సంతృప్తిగా ఉండేది. భర్త ఆస్పత్రిలో ఉన్నాడన్న ఊహ ఒక్కటే ఆమెకి ఇప్పుడు భయంకరంగా తోస్తోంది.

'నలుగురితోపాటు పంచుకుంటే నరకమైనా స్వర్గమే!' అన్నట్టుగా ఉందామెకు.

పదిహేను రోజుల క్రిందట భర్తని ఆస్పత్రిలో చేర్పించినప్పుడు ఉన్న ఆందోళన, ఇప్పుడు లేదు ఆమెలో.

ఇప్పుడు – ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అలా వెళ్లి, భర్తని చూసి వస్తోంది. తను భర్త పక్కనే ఉండి అతని అవసరాలేవో తెలుసుకునే తీరిక లేదు. పైగా అలాంటి అవసరాలూ, ఇంకా ఏమైనా సపర్యలు చేయడానికి కూతుళ్లూ, కొడుకులూ కోడళ్లూ ఉండనే ఉన్నారాయె!

ముసలాయన పరిస్థితి రోజురోజుకీ విచిత్రంగా తయారవుతూ ఉంది. ఒకరోజు బాగా కళ్లు తెరిచి అందరినీ చూసే ప్రయత్నం చేస్తూ మాట్లాడబోతాడు. తర్వాతి రోజునే ఏ క్షణానయినా ప్రాణం పోతుందేమో నన్నంతగా అందరినీ హడలగొట్టేస్తాడు.

అందరికీ ఆ పరిస్థితి మామూలుగా తయారవుతోంది.

శారదమ్మలో ఎందుకో మునుపటి ధైర్యం, ఉత్సాహం కనిపించడంలేదు. ఏదో తెలియని భయం ఆమెను వెన్నాడుతోంది. భర్త త్వరగా చనిపోతే మేలేమో అనుకుంటోంది. 'వీళ్లంతా ఎలాగూ వచ్చారు. ఇప్పుడు చనిపోతే అందరూ ఒక పని పూర్తయినట్టు, భావించి వెళ్లిపోతారు. తీరా పరిస్థితి మెరుగుపడిందని అందరూ ఎక్కడి వాళ్ళు అక్కడికి వెళ్ళిపోతే, అప్పుడు జరగరానిది జరిగితే తనేమైపోవాలి? ఏ దిక్కూ లేని అనాథప్రేతంలా పోతాడేమో!' – ఈ దిగులు శారదమ్మ గుండెను తొలిచేస్తోంది.

"అమ్మా! అమ్మా! పెద్ద వదిన ఏమందో తెలుసా!" అంటూ వంటింట్లోకి

వచ్చింది.

"ఏమంది?" అంది కూరలు తరుగుతూ శారదమ్మ.

"ఈ ముసలాయన ఎప్పుడు చచ్చిపోతాడో గానీ, ఈలోగా ఊరికెళ్లకుండా మనం చచ్చిపోవాలి, అని అందమ్మా! ఎంత మాటందో చూడు!" అంటూ నిర్మల చెబుతుంటే గమ్మున శూన్యంలోకి చూస్తుండిపోయింది శారదమ్మ.

శారదమ్మ ఊహించిందే ఈ పరిస్థితి. పెద్దకోడలు తొందరగా బయటపడింది. తక్కినవాళ్లంతా ఆ మాట అనేందుకు ఇక ఎన్నాళ్లో పట్టదని కూడా తెలుసు శారదమ్మకి.

"ఏమ్మా! ఏం మాట్లాడవు?" అంది నిర్మల.

"ఏం మాట్లాడను, నిమ్మీ! ఆ పిల్ల నైజం తెలుసు కదా మొదటి నుంచి. మీ నాన్న త్వరగా అక్కడ చచ్చిపోతే మీ అందరికీ బాధ తప్పిపోతుంది. ఆయనది మొండి ప్రాణం. ఆ శరీరాన్ని వదలిపోకుండా ఉందమ్మా!" అంటూ భోరున ఏడ్చేసింది శారదమ్మ, నోట్లో కొంగు కుక్కుకుంటూ.

"అమ్మా! ఏడవకే ..." అంటూ తల్లి తలని ఎద మీద ప్రేమగా హత్తుకుంది నిర్మల.

ఆ సాయంత్రం ఆస్పత్రికి వెళ్లేందుకు సిద్ధమవుతోంది శారదమ్మ.

"ఏంటే రుక్కూ! పనీ పాటా వదిలేసి ఎన్నాళ్ళని ఇట్లా? ఏదన్నా ఒకటి జరిగిపోతే తొందరగా వెళ్దామనుకుంటూ ఉంటే ..." అంటున్నాడు రుక్మిణి భర్త.

"ఏమండీ! అమ్మ ఇంకా బయట గదిలో ..." అంటూ రుక్మిణి వారిస్తోంది.

"నే నేం తప్పు మాట్లాడాను? వయసులో ఉన్న వాళ్ళ విషయంలో మనం ఇట్లా మాట్లాడటం తప్పే! మామయ్యకి అరవై అయిదేళ్ళు పైబడిపోయాయి. ఆయన కేం ఉద్యోగిగా, తండ్రిగా, తాతగా అన్నీ అనుభవించాడులేవే! ఇంకా ఆయన ఉండడం అందరికీ బరువు."

అల్లుడు అలా అంటుంటే ఇక అక్కడ ఉండాలనిపించలేదు శారదమ్మకి. గబగబా వీధిలోకి వెళ్లిపోయింది.

"భగవంతుడా! ఆయన్ని నీ దగ్గరికి త్వరగా పిలుచుకో తండ్రీ!" అంటూ గట్టిగానే గొణుక్కుంటూ నడుస్తోంది.

మరుసటి రోజు ఉదయం, సుధాకర్ గెడ్డం చేసుకుంటున్నాడు. కొడుక్కి కాఫీ అందించడానికి వచ్చింది శారదమ్మ .

"అమ్మా! నాకు సెలవు లేదు. అక్కడ ఢిల్లీలో నా పరిస్థితి కూడా అంత బాగాలేదు. నిజంగా చెప్పాలంటే చాలా దారుణంగా ఉంది. మా కంపెనీలో అసలే నా మీద ఈర్ష్య ఎక్కువ. ఇప్పుడు నేను లేనుగా! నా గురించి పై అధికార్లకి చాడీలు చెప్పి సరిపోకుండా చేస్తారు. అంతేకాదమ్మా! పిల్లల చదువులు ఏంగానూ?" అన్నాడు సుధాకర్.

"అది కాదు రా! మీ నాన్నకి ..." అంటూ ఏదో చెప్పబోతోంది శారదమ్మ.
"నాన్న పరిస్థితి మునుపటికంటే మెరుగే కదమ్మా! ఏం పరవాలేదు. ఒక పని చేద్దాం! ఒక మంచి ఆయాని నిర్మల భర్త మాట్లాడాడట. ఆ అమ్మాయి నర్సు ట్రైనింగ్ కూడా అయిందిట. నాన్నని కంటికి రెప్పలా చూసుకుంటుంది. ఆ అమ్మాయి నెల జీతం వెయ్యి రూపాయలు ఇస్తాం. నేనూ మోహన్ చెరో అయిదు వందలూ భరిస్తాం. ఇక నాన్న ... నాన్న మందులకు అయ్యే ఖర్చులు ఎంతయినా భరిస్తాం. సరేనా!"

"అంటే ... మోహన్ కూడా ..." అంది ఏం మాట్లాడాలో తోచక.

"ఆ, మేమంతా కలిసే మాట్లాడాం. మోహన్‌కి కూడా సెలవు లేదట. వాడికీ చదివే పిల్లలు ఉన్నారుగా. నీ కోడళ్లు ఆ నర్సు ట్రెయినింగ్ అయిన అమ్మాయికంటే ఏం చాకిరీ చేయగలరు!" అని సుధాకర్ అంటూంటే శారదమ్మ గొంతు పెగల్లేదు.

"ఏమ్మా! అన్నయ్య చెప్పిందానికి ఏం మాట్లాడావు?" అంది నిర్మల.

"ఏమని మాట్లాడనమ్మా! మీ రంతా ఒక నిర్ణయానికి వచ్చాక ..." అంది నిర్లిప్తంగా శారదమ్మ.

"మేము ఎప్పటికప్పుడు ఫోన్ చేసి విషయాలన్నీ కనుక్కుంటూ ఉంటాం" అన్నాడు సుధాకర్.

మారు మాట్లాడకుండా బాత్‌రూమ్‌లోకి దూరిపోయింది శారదమ్మ.

ఆ తర్వాతిరోజు ఉదయమే - సన్నగా, పొడుగ్గా, ఎర్రగా, తెల్ల చీర కట్టుకున్న ఓ అమ్మాయి బయట గదిలో కూర్చునుంది. ఆ అమ్మాయి మొహంలో ఏదో వింత అందం ఉంది. ఆ వింత అందం ఆమె కళ్లలో ఉందో, తీర్చిదిద్దినట్టున్న ముక్కుపుటాల్లో ఉందో, పల్చని పెదవుల్లో ఉందో చెప్పటం కష్టం.

"ఈ అమ్మాయే నమ్మా! నర్సు ట్రైనింగ్ అయిన అమ్మాయి. పేరు సబిత!" అని తల్లికి పరిచయం చేశాడు మోహన్.

"ఊఁ" అంది శారదమ్మ.

ఆ పిల్ల వినయంగా లేచి నవ్వుతూ శారదమ్మకి నమస్కరించింది.

"చూడు, సబితా! మా నాన్నని జాగ్రత్తగా చూసుకోవాలి. మా అమ్మకి అన్ని విషయాల్లో కో-ఆపరేట్ చేయాలి. మేము లేని లోటు తెలియనివ్వకూడదు!" అన్నాడు నవ్వుతూ మోహన్.

"అలాగే, సార్!" అంది సబిత, మరింత వినయంతో.

"ఇంతకీ ఎప్పుడు వెళ్తున్నార్రా. అంతా?" అనడిగింది శారదమ్మ, మోహన్ని.

"ఈ సాయంత్రమే నమ్మా!" అన్నాడు మోహన్ - తల్లి మొహంలోకి చూడకుండా.

సాయంత్రం అవుతున్నట్లే శారదమ్మకి మనసంతా గుబులు గుబులుగా ఉంది. ఇంట్లో అందరూ ప్రయాణాల హడావుడిలో పడ్డారు. ఎవరి పిల్లల్ని వారు అతి శ్రద్ధతో తయారుచేస్తున్నారు.

"భగవంతుడా! వీళ్ళని ఆపలేవా తండ్రీ!" అని నిస్సహాయంగా మొక్కుకోవడం తప్ప ఏం చేయలేకపోతోంది శారదమ్మ.

అరుగంటలకి నాలుగు ఆటోలు వచ్చాయి. శారదమ్మని అందరూ బాధ్యతగా ఓదార్చి తమ స్వంత బాధ్యతలను నెరవేర్చుకోవడానికి ఆటోలు ఎక్కారు. పిల్లల కెవరికీ అక్కడినుంచి వెళ్లాలని ఏ మాత్రం ఇష్టం లేకున్నా, శారదమ్మకి బలవంతపు టాటాలు చెప్పి వెళ్ళిపోయారు.

అందరూ వెళ్ళిపోయాక బోసిపోయిన ఇంట్లో, ఒక్కతే ఏడుస్తూ కూర్చుండిపోయింది.

అరగంట తర్వాత, తనిక ఇంట్లో ఉండి చేసేదేమీ లేక, హాస్పిటల్ కి బయలుదేరింది శారదమ్మ.

జీవితంలో ఇలాంటి బాధలు పగవాళ్ళకి కూడా తేవద్దని, దేవుడికి మొరపెట్టుకుంటోంది. మనసు. హాస్పిటల్ చేరుతూనే భర్తను చూసి దుఃఖం పొంగుకొచ్చింది. నిస్సహాయంగా, మౌనంగా రోదించింది శారదమ్మ.

"మీరెంత అదృష్టవంతులండీ ఏమీ తెలియని కోమాలో ఉన్నారు" అనేసింది కాస్త గట్టిగానే - బొంగురు గొంతుతో.

ఏం జరిగిందో నని నర్సూ, సబితా ఇద్దరూ పేషెంటును పరీక్షిస్తున్నారు.

"ఏం కాలేదులేమ్మా! డోన్ట్ వర్రీ! హి ఈజ్ ఆల్ రైట్ మునుపటిలానే ఉన్నారు" అంది నర్సు నవ్వుతూ.

"శారదమ్మగారు! నేను ఇంటికెళ్ళి అయిదు నిమిషాల్లో వచ్చేస్తా!" అంది సబిత.

వెళ్ళమని తల ఆడించింది శారదమ్మ.

ముసలాయన ముక్కులోంచి, నోట్లోంచి గురకలాంటి శబ్దం.

శారదమ్మ కళ్లల్లో కన్నీళ్లు పొంగలేదు. అలా వెర్రిగా చూస్తోంది అతనివైపు. స్టూలు మీద కూర్చుంది. అతని జుత్తుని సుతారంగా తడిమి, మగతగా దిండుకి ఆనుకుంది.

* * *

సబిత అయిదు నిముషాల్లో తిరిగి వచ్చేసింది. "అమ్మా! మీరు ఇంటికి వెళ్లండి నేను చూసుకుంటాను" అంది శారదమ్మని కుదుపుతూ.

తల వేలాడేసి ఉంది శారదమ్మ!

ముసలాయన గురక మరీ స్పష్టంగా వినిపిస్తోంది అందరికీ ... ఒక్క శారదమ్మకి తప్ప!

*(ఆంధ్రప్రభ వీక్లీ 12.5.93)*